క్లుప్తంగా

దర్శనాలను వాయిదా వేసుకోవాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: వర్షాల వరదల కారణంగా మేడారం సమ్మక్క–సారలమ్మ దర్శనాలను భక్తులు వాయిదా వేసుకోవాలని మేడారం జాతర కార్యనిర్వహణాధికారి రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాలతో మేడారం జంపన్న వాగు వరదల రాకపోకలు స్తంభించాయన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టేంత వరకు భక్తులు మొక్కులను వాయిదా వేసుకోవాలన్నారు. ఈ విషయాన్ని భక్తులు గమనించి సహకరించాలన్నారు.

వైద్యశిబిరం

వెంకటాపురం(కె): మండల పరిధిలో వాడగూడెం, శ్రీరంగాపురం, రామచంద్రాపురం, వీఆర్‌కెపురం గ్రామంలో ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామల్లో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. అనంతరం లక్ష్మీనగరం బాలుర వసతి గృహంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు.

జెడ్పీ చైర్‌పర్సన్ చొరవతో సహాయక చర్యలు

ఎస్ఎస్‌తాడ్వాయి: జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి చొరవతో మేడారంలో ఎన్‌డీఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టారు. మేడారం జంపన్నవాగు వరదలకు నార్లాపూర్‌లో, జంపన్నవాగు బ్రిడ్జి వద్ద గ్రామస్తులు వరదలో చిక్కుకున్నారనే సమాచారం మేరకు నాగజ్యోతి జిల్లా అధికారులతో మాట్లాడి ఎన్‌డీఎఫ్ బృందాలను రప్పించడంతో వరదలో చిక్కుకున్న వారిని ఎన్‌డీఎఫ్ బృందాలు బయటకు తీసుకువచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ చొరవతో ఎన్‌డీఎఫ్ బృందాలు 16 మందిని కాపాడారు.

విద్యుత్ సరఫరాకు చర్యలు

ఎస్ఎస్‌తాడ్వాయి: భారీ వర్షంతో పస్రాలోని సబ్‌స్టేషన్ నీట మునిగి మండలంలోని పలు గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌కో డీఈ పులుసం నాగేశ్వర్‌రావు ఆదేశాల మేరకు ఏఈ వేణుకుమార్ పర్యవేక్షణలో సబ్ ఇంజనీర్ జ్ఞానేశ్వర్, జేఎల్ఎం అమీర్, శివరాంలు విద్యుత్ సరఫరాను పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. పస్రా సబ్‌స్టేషన్ నీట మునిగిపోవడంతో ఏటూరు నాగారం నుంచి విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టారు. తాడ్వాయి ఏటూరునాగారం మధ్యలో వర్షాలకు చెట్లు విరిగిపోవడంతో వాటిని తొలగించి తాడ్వాయి, మేడారానికి విద్యుత్ సరఫరాను అందజేశారు.

సందర్శనకు రావొద్దు

మంగపేట: మండల కేంద్రంలోని గౌరారం వాగుపై అసంపూర్తిగా నిర్మించిన బ్రిడ్జిపై ప్రజలు ఎవరుకూడా సందర్శనకు వచ్చి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని ఏటూరునాగారం సీఐ రాజు, ఎస్సై తాహెర్‌బాబా తెలిపారు. వాగు వరద ఉధృతిని చూసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో బ్రిడ్జిపైకి తరలివచ్చారు. భారీ వరద కారణంగా బ్రిడ్జి చివర గొయ్యి ఏర్పడిందని, వరద ఉధృతి తీవ్రంగా ఉండటంతో ప్రమాదం పొంచిఉందని హెచ్చరించారు. సంబంధిత పంచాయతీ అధికారులు వెంటనే బ్రిడ్జిపైకి ఎవరుకూడా రాకుండా బారికేడ్స్, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని బోరునర్సాపురం పంచాయతీ కార్యదర్శి విద్యావతి, మంగపేట పంచాయతీ కార్యదర్శి హీరూకు సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

వాజేడు: వాజేడు, వెంకటపురం(కె) మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్ అన్నారు. గురువారం వాజేడు మండలంలోని ముంపు ప్రాంతాలను తహసీల్దార్ సయ్యద్ సర్వర్, ఎస్సై వెంకటేశ్వర్‌రావుతో కలిసి పరిశీలించారు. మండల పరిధిలోని కోయవీరాపురం గ్రామ సమీపంలో రహదారిపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న చాకలి వాగును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షలు అధికంగా కురుస్తున్న కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వారి వెంట ఆర్ఐ రాజు ఉన్నారు.

నీట మునిగిన మద్యం దుకాణం

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమీపంలోని రెడ్డిగూడెంలో దారిలో ఉన్న తిరుమల మద్యం దుకాణం జంపన్నవాగు వరద నీటిలో మునిగిపోయింది. మద్యం దుకాణంలోకి వరద ఒకసారిగా చేరాడంతో షాపులో పని చేస్తున్న గుమస్తాలు బయటకు పరిగెత్తారు. మద్యాన్ని బయటకు తరలించే వీలు లేకుండా పోయింది. షాపు నీట మునిగిపోవడంతో షాపులో ఉన్న సుమారుగా రూ.30లక్షల మద్యం నష్టం వాటిల్లిందని షాపు నిర్వాహకులు తెలిపారు.

ఆర్థిక సాయం

వెంకటాపురం(కె): మండల పరిధిలోని పాత్రాపురం గ్రామానికి చెందిన గగ్గూరి సతీష్ ఇల్లు వర్షానికి కూలింది. దీంతో బాధిత కుటుంబానికి అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సాయం అందజేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పీర్ల కృష్ణబాబు 25 కేజీల బియ్యం, మూడు వేల రూపాయలు అందజేశారు. బాడిస రాఘవులు, శేఖర్, తిరుపతి తదితరులు ఉన్నారు.

ములుగు రూరల్: వరద ప్రాంతాలను పరిశీలించి సీఐతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క



ములుగు రూరల్: బాధితులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి



పస్రా–తాడ్వాయి మధ్య లవ్వాల స్టేజీ సమీపంలో..



వెంకటాపురం(కె): బర్రెబొంద వద్ద కోతకు గురైన రోడ్డు



అస్తవ్యస్తం

జిల్లా వ్యాప్తంగా బుధవారం రాత్రి కురిసిన వర్షానికి వాగులు వంకలు పొంగిపొర్లి రహదారులు జలమయమయ్యాయి. గ్రామాల్లోని చెరువులు కుంటలు నిండడంతో మత్తళ్లు పరవళ్లు తొక్కుతున్నాయి. పెరిగిన వరదలతో పలు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం స్తంభించింది. ఎమ్మెల్యే సీతక్క, జెడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి, ఐటీడీఏ పీఓ అంకిత్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ గాష్ ఆలం , తదితర అధికారులు వరుద ఉధృతిని గురువారం పరిశీలించి సహయక చర్యల్లో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మంగపేట: పునరావాస కేంద్రంలో బాధితుల వివరాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ అంకిత్



తాడ్వాయి–పస్రా మధ్యలో ధ్వంసమైన రోడ్డు



వెంకటాపురం(ఎం): ధ్వంసమైన రామప్ప తూర్పు రోడ్డు



గోగుపల్లిలో కొట్టుకుపోయిన పొలాలు



రామన్నగూడెం వద్ద గోదావరి..



మంగపేట: కప్పవాగు వరదతో మునిగిన రోడ్డు



మంగపేట: గ్రామస్తులతో మాట్లాడుతున్న మండల స్పెషల్ ఆఫీసర్ తుల రవి



మంగపేట: ట్రాక్టర్‌పై వెళ్తున్న అధికారులు



మంగపేట: వరదకోతకు గురైన కొత్తచీపురుదుబ్బ బీటీరోడ్డు



వెంకటాపురం(కె): అబ్బాయిగూడెంలో కోతకు గురైన రోడ్డు



చిన్నబోయినపల్లిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో అధికారులు



మంగపేట–ఏటూరునాగారం మధ్యలో ఆగిన వాహనాలు



కన్నాయిగూడెం: బుట్టాయిగూడెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న అనుమంతుని వాగు



కన్నాయిగూడెం: ప్రవహిస్తున్న పశువులపానాది వాగు




మంగపేట: గంపోనిగూడెం వద్ద రైతువేదికను చుట్టు ముట్టిన వరదనీరు



కన్నాయిగూడెం: ఐలాపుర్ వద్ద కొర్లవాగు ఉధృతి



వాజేడు: నీట మునిగిన పొలాలు



వాజేడు: పూసూరు బ్రిడ్జి వద్ద గోదావరి వరద



ములుగు రూరల్: మల్లంపల్లిలో కూలిన ఇల్లు



వెంకటాపురం(ఎం): నల్లగుంట శివారులో కుంటకు గండిపడడంతో తెగిపోయిన రోడ్డు



ఏటూరునాగారం: ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పీఓ అంకిత్



మంగపేట: కోతకు గురైన ఏటూరునాగారం–బూర్గంపాడు రోడ్డు



వెంకటాపురం(ఎం)లో జలమయమైన ఇల్లు

మిర్చి నారు వరదపాలు!



వరదకోతకు గురైన మిర్చి నారుమడులు



నారుమడులపై ఇసుక మేటలు

మంగపేట: మండల కేంద్రంలోని గౌరారంవాగు ఒడ్డు వెంట మిర్చి రైతులు లక్షల రూపాయాల ఖర్చులతో కొనుగోలు చేసిన మిర్చీ విత్తనాల నారుమడులు వర్షానికి కోతకు గురై వరదలో కొట్టుకుపోయాయి. దీంతో సుమారుగా రూ.50 లక్షలకు పైగా నష్టం జరిగినట్లు బాధిత రైతులు వాపోతున్నారు. వాగు ఒడ్డు వెంట మిర్చి నారు పెంపకానికి అనుకూలమైనది కావడంతో కొన్నేళ్ల నుంచి రైతులు భూయజమానితో కొంత ధరకు మాట్లాడుతకుని మిర్చీ నారు పెంచుతున్నారు. రైతులతో పాటు ఆయా భూముల యజమానులు కొందరు రైతులకు నారు విక్రయించి ప్రతి ఏటా ఆధాయాన్ని పొందుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మిర్చి రైతులతో పాటు ఇతర, మండలాలు, వివిధ జిల్లాలకు చెందిన సుమారు 500 మందికి పైగా రైతులు నారుమడులలో విత్తనాలు నాటారు. ప్రస్తుతం మొక్క రెండు నుంచి 04 ఆకుల దశలో ఉన్నాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు గౌరారంవాగు ఉధృతంగా ప్రవహించడంతో ఒడ్డు వెంట ఉన్న నారుమడులు కోతకుగురై వాగులో కలిసిపోయాయి. అలాగే పలు చోట్లు నారుమడులపై ఇసుక మేటలు ఏర్పడ్డాయి. దీంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ప్రభుత్వం స్పందించి సంబంధిత అధికారులతో సర్వే చేసి నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు వాపోతున్నారు. వరద కోతకు గురైన నారుమడులను మండల స్పెషలాఫీసర్ తుల రవి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఏటూరునాగారం సీఐ రాజు, ఎస్సై తాహెర్‌బాబా, పరిశీలించి జరిగిన నష్టాన్ని బాధిత రైతులను అడిగి తెలుసుకున్నారు.

పరిహారం చెల్లించాలి



40 పాకెట్ల విత్తనాలు రూ.34 వేలకు కొనుగోలు చేశా. నారుమడులకు, ఎరువులు, ఇతర ఖర్చులకు రూ.20 వేలు ఖర్చయ్యాయి. నారుమడుల పైనుంచి వరద పారడంతో కొట్టుకు పోయాయి. నాతో పాటు వందలాది మంది రైతులకు ఇదే విధంగా జరిగింది. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– మీస నర్సింహారావు, తిమ్మంపేట,మిర్చి రైతు

రైతులను ఆదుకోవాలి

మంగపేట: మండల కేంద్రంలోని గౌరారంవాగు వరద ఉధృతికి కోతకుగురై కొట్టుకుపోయిన మిర్చి నారుమళ్ల బాధిత రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు, మండల ఇన్‌చార్జ్ గుమ్మడి సోమయ్య డిమాండ్ చేశారు. గౌరారం వాగు వరద ఉధృతికి కొట్టుకుపోయిన నారుమళ్లను గురువారం కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. పార్టీ మండల వర్కింగ్ కమిటీ కన్వీనర్ వెంకటేశ్వర్లు, నర్రా కిశోర్, మండల ప్రధాన కార్యదర్శి కారుపోతుల నర్సయ్యగౌడ్,మండల నాయకులు చాద మల్లయ్య, యానయ్య, పవన్, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు నాయకులు పాల్గొన్నారు.



నారుమడులను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజలు ధైర్యంగా ఉండాలి

ఏటూరునాగారం: మండలంలోని కొండాయి, మల్యాల ప్రాంతాల్లోకి వరద రావడంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, నాయకులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సీతక్క, జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆదేశాల మేరకు లోతట్టు గ్రామాలను సందర్శించామన్నారు. స్థానిక ఏఎస్పీ సంకీర్త్‌కు వరద వల్ల జరిగే నష్టాలను వివరించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయూబ్, ఖలీల్, గుడ్ల దేవేందర్, నర్సింహారావు, గౌస్, సులేమాన్, లక్ష్మయ్య, శ్రీను, వినయ్, మధుబాబు, మామిడి రాంబాబు, అక్షిత్ పాల్గొన్నారు.

సహాయక చర్యల్లో నాయకులు

ఏటూరునాగారం: మండలంలోని కొండాయి, దొడ్ల, మల్యాల ముంపు ప్రాంతాల్లోని బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి బీఆర్ఎస్ నాయకులు గురువారం సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఖాజాపాషా మాట్లాడుతూ.. ముంపు ప్రాంతాల్లోని ప్రజలను మండలంలోని చిన్నబోయినపల్లి ఆశ్రమ పాఠశాలకు తరలించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు తుమ్మ మల్లారెడ్డి, వైస్ ఎంపీపీ తుమ్మ సంజీవరెడ్డి, ఏటూరునాగారం సర్పంచ్ ఈసం రామూర్తి, పీఏసీఎస్ డైరెక్టర్ మాదరి రామయ్య. కొండాయి గ్రామ కమిటీ అధ్యక్షుడు పాయం రాకేష్, రాంబాబు, నర్సయ్య, రామకృష్ణ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ములుగు రూరల్: అప్పుల బాధతో రైతు ఆత్మహత్యకు చేసుకున్న సంఘటన మండలంలోని జాకారంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జాకారం గ్రామానికి చెందిన చెతుర్వేదుల శ్రీకాంత్ (33) జాకారం శివారులోని సొంత భూమి రెండు ఎకరాలు, దీంతో పాటు మరో ఎకరం కౌలుకు తీసుకొని సాగు చేసుకుంటు జీవనం కొనసాగిస్తున్నాడు. మూడు సంవత్సరాలుగా వ్యవసాయంలో ఆశించిన రీతిలో దిగుబడి రాకపోవడంతో రూ.9లక్షల 50 వేలు అప్పుల పాలయ్యాడు. దీంతో మనస్తాపానికి గురై బుధవారం రాత్రి భార్య ఇంట్లో లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహ్యతకు పాల్పడ్డాడు. ఇంట్లోకి వచ్చిన భార్య భర్త ఉరి వేసుకునక్న విషయం గమనించి కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు ఆస్పత్రికి తరలించగా వైద్యులు గమనించి అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య సమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అప్పాని వెంకటేశ్వర్ తెలిపారు.

వరద బాధితులను ఆదుకోవాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారంలోని వరద బాధితులను అదుకోవాలని కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాలకు జంపన్నవాగు వరదకు మేడారం జలమయంగా మారి ఇళ్లు, వ్యాపారుల దుకాణాలు నీట మునిగిపోవడంతో సీతక్క గురువారం వరద బాధితులను పరామర్శించారు. వరదలతో తీరని నష్టం వాటిల్లిందని కట్టుబట్టలతో బయటకు వచ్చామని గ్రామస్తులు, చిరు వ్యాపారులు సీతక్కకు వివరించారు. వరద పరిస్థితులపై సీతక్క ఆరా తీశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే వరద బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సీతక్క అమ్మవార్లను దర్శించుకుని వరదలు శాంతించాలని పూజలు చేశారు. సీతక్క వెంట మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, గౌరవ అధ్యక్షుడు అనంతరెడ్డి, సర్పంచ్ ఇర్ప సునీల్, జిల్లా నాయకుడు అరెం లచ్చుపటేల్, నాయకులు పాక రాజేందర్, రాము ఉన్నారు.



ఎస్ ఎస్‌తాడ్వాయి: మాట్లాడుతున్న సీతక్క

ఏటూరునాగారం: మండలంలోని దొడ్ల, మల్యాల, కొండాయి ముంపు బాధిత ప్రజలను ఎమ్మెల్యే సీతక్క గురువారం పరామర్శించారు. చిన్నబోయినపల్లిలో పునరావాస కేంద్రాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడారు. సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. నాయకులు రఘు, వెంకన్న ఉన్నారు.

బాధితులను అదుకుంటాం..

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం వరద బాధితులను ఆదుకుంటామని జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. మేడారం జంపన్నవాగు వరదలకు నష్టపోయిన వరద బాధితులను నాగజ్యోతి గురువారం పరామర్శించారు. వరద నష్టాలపై బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేడారంతో పాటు, చట్టు పక్కల గ్రామాల్లోని వరద బాధితులకు ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. వరదల వల్ల జరిగిన నష్టాలను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. అనంతరం వర్షాలు తగ్గుముఖం పట్టి వరదలు శాంతించాలని సమ్మక్క– సారలమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, ఎండీ రఫీక్ ఉన్నారు.



వరద నష్టాలను తెలుసుకుంటున్న నాగజ్యోతి